క్లుప్తంగా

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులతో ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ చంద్రశేఖరరావు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరు పట్టుదలతో చదువుకుంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద గురువారం జరిగిన వార్షిక వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఇక్కడ మంచి సదుపాయాలతో పాటు విద్య చక్కగా అందిస్తున్నారని, దానికి తగిన విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. దానివల్ల వారు కోరుకున్న విధంగా ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీ షాబేగం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆడ పిల్లలకు ఎన్నో గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నేత్రం ఏర్పాటు



మరలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా స్తంభం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం ప్రధాన కూడలి వద్ద ఇటీవల ప్రొక్లెయిన్ ఢీ కొనడంతో ఇక్కడ ఉన్న సీసీ కెమెరా స్తంభం నేలకొరిగింది. ఇది భీమిలి బీచ్ రోడ్డుకు, విశాఖ వెళ్లే ప్రధాన రహదారికి, అదేవిధంగా మారికవలస, మధురవాడ వెళ్లేందుకు ఇది ప్రధాన కూడలి. దీంతో అధికారులు వెంటనే స్పందించి గురువారం సీసీ కెమెరా స్తంభాన్ని మరలా ఏర్పాటు చేశారు.

వీరుబాబు విడుదల



విజయవాడలో వీరుబాబును కలిసిన అప్పలనాయుడు

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన సోషల్‌మీడియా కార్యకర్త జీరు వీరుబాబును బెజవాడ పోలీసులు గురువారం విడిచిపెట్టారు. గతేడాది నవంబరులో ఫార్వార్డ్ మెసేజ్ ఇన్‌స్టాలో పోస్టు చేశాడన్న నెపంతో బుధవారం గవర్నర్‌పేటకు చెందిన ఇద్దరు పోలీసులు వీరుబాబును నాటకీయ పరిణామాల మధ్య ముందుగా భీమిలి, తరువాత విజయవాడ తరలించిన సంగతి తెలిసిందే. విజయవాడ తీసుకువెళ్లిన తరువాత కూడా అక్కడ విచారణలో వీరుబాబు ఎలాంటి నేరం చేయలేదని తెలిసినా.. అక్కడ ఏసీపీకి కూటమి పెద్దల నుంచి వరుసగా ఒత్తిడి రావడంతో బయటపెట్టే ప్రయత్నం చేశారు. దీంతో విజయవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాగవంశ అనుబంధ సంఘం అధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు, రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి అంజిరెడ్డి, ఉమ్మడి కృష్ణా జిల్లా లీగల్ సెల్ ప్రతినిధి గవాస్కర్ జోక్యంతో వీరుబాబును విడిచిపెట్టక తప్పలేదు. వీరుబాబు ఫోన్‌ను సీజ్ చేశారని, తరువాత విచారణకు పిలిస్తే రావాలని సూచించినట్లు తెలిసింది.

వసతి గృహానికి వృద్ధుడు



షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయితో అప్పారావు

సీతమ్మధార: భీమిలికి చెందిన దార అప్పారావు (75)కు ఇద్దరు పిల్లలు. వాళ్లు వివాహాలు చేసుకుని వేరేగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అప్పారావు భార్య కూడా అతన్ని వదిలేసి వెళ్లిపోవడంతో ఒంటరి వాడైన అప్పారావు వారం రోజులుగా ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉంటున్నాడు. ఏయూటీడీ సిబ్బంది ఇది గమనించి అప్పారావును షెల్టర్ హోంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీలు శిథిలం



డ్రైనేజీ మధ్యలో వీధి లైటు

- చిల్లపేట – జీరుపేటలో డ్రైనేజీలపై నిర్లక్ష్యం
- పూడుకుపోయి, రోడ్డులో కలిసిపోయిన డ్రైనం
- ప్రస్తుతం మురుగుకు బదులు మట్టి, ప్లాస్టిక్
- ఆధునికీకరించాలంటున్న స్థానికులు



రెండు గ్రామాల మధ్య డ్రైనేజీ పరిస్థితి



జీరుపాలెం గ్రామంలోకి వెళ్లే చోట డ్రైనేజీ



గ్రామాన్ని ఆనుకుని ఉన్న డ్రైనేజీలో పేరుకున్న నాచు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు చిల్లపేట–జీరుపేట గ్రామాల్లో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో భీమిలి మున్సిపాల్టీలో 13, 25 వార్డులుగా ఉన్న భీమిలి ప్రధాన రహదారిలో పెద్ద డ్రైనేజీ ఉండేది. తగరపువలస గ్రామాలతో పాటు చిట్టివలస పెద్ద చెరువు నుంచి వచ్చే నీరు ఈ డ్రైనేజీల ద్వారా చిల్లపేట గల్లీ రోడ్డు మదుం నుంచి అవతలికి చేరి ఉప్పుటేరు వైపు ప్రవహించేది. కానీ దశాబ్దాల క్రితమే ఈ డ్రైనేజీ ఆనవాళ్లు కోల్పోయింది. డ్రైనేజీకి ఇరువైపులా రాళ్లు కూరుకుపోయాయి. వర్షాలు కురిసే సమయంలో మార్గమధ్యలో మట్టి, ప్రవాహంతో వచ్చే పాలిథిన్, ప్లాస్టిక్, మద్యం బాటిళ్లతో ఈ డ్రైనేజీ నిండిపోయింది.

ఇళ్లలోకి విషపురుగులు

చెరువును ఆనుకుని శెట్టిబలిజలు నివాసం నుంచి చిట్టివలస శివారు వరకు ఇదే దుస్థితి కనిపిస్తుంది. పూడుకుపోయిన డ్రైనేజీలు భూమిలో కలిసిపోయాయి. దీంతో డ్రైనేజీలకు చేరువలో నివాసం ఉంటున్నవారు చెరువు పక్కన నివసిస్తున్నట్టు అలవాటు పడిపోయారు. ఒక్కోసారి పిల్లలు, వృద్ధులు వీటిలో పట్టుతప్పి పడిపోతుంటారు కూడా. ఇక్కడి వీధి లైట్లు కూడా శిథిల డ్రైనేజీలో ఉండటంతో కేబుల్, లైట్లు మార్చడానికి సిబ్బంది మూడు అడుగుల లోతు శిథిల డ్రైనేజీలో దిగక తప్పదు. చెరువులాంటి శిథిలమైన ఈ డ్రైనేజీల నుంచి నిత్యం విషపురుగులు, దోమలు, కప్పలు వీరి ఇళ్లల్లోకి చేరడం నిత్యకృత్యమైంది. వర్షం వస్తే డ్రైనేజీ ఉన్న విషయాన్ని కూడా స్థానికులు మరచిపోతుంటారు. ప్రస్తుతం ఈ డ్రైనేజీ పొడవునా మురుగుతో నల్లగా, అందులో పెరిగే ఆకుతో పచ్చగా, డెబ్రిస్ వేసుకునే డంపింగ్‌యార్డుగా కనిపిస్తుంది. ఏటా వర్షాకాలానికి ముందు జీవీఎంసీ సిబ్బంది మొక్కుబడిగా పూడికతీసి చేతులు దులుపుకొంటారు. దీనిపై ఈ రెండు గ్రామాల ప్రజలలో చైతన్యం రాకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా వారికి లేని బాధ మనకెందుకులే అన్నట్టు, వెళ్లిపోతుంటారు.

ఘనత వహించిన రహదారి..

చారిత్రాత్మకంగా వందల ఏళ్ల చరిత్ర కలిగిన భీమిలి పట్టణానికి కేవలం నాలుగు కిలోమీటర్లు దూరంలో ఈ చిల్లపేట–జీరుపేట జంటగ్రామాలు ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భీమిలి అందాలను చూడటానికి వచ్చే గ్లోబల్ పర్యాటకులు ఒక్కోసారి తగరపువలస వైపు కూడా రాకపోకలు చేస్తుంటారు. అంతేనా మంత్రులు, ఎమ్మెల్యేలు తరచూ భీమిలి వస్తుంటారు. అసలే 30 అడుగుల లోపే ఉన్న తగరపువలస–భీమిలి రహదారిని ఆనుకుని ఉన్న ఈ శిథిల డ్రైనేజీకి మరమ్మతులు చేయించాలని, జీవీఎంసీలో మిగిలిన వార్డుల మాదిరిగానే పటిష్టమైన సీసీ డ్రైనేజీ నిర్మించాలని ఈ జంట గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి మగ్గుతున్న మురుగు సమస్య నుంచి గట్టెక్కించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నా చిన్ననాటి నుంచి మరమ్మతులు లేవు



నాకు ఇప్పుడు 50కి పైగా వయసు. నా చిన్ననాటి నుంచి డ్రైనేజీ ఇలాగే ఉంది. పంచాయతీ కాలం నాటి డ్రైనేజీ ఇది. తరువాత మున్సిపాల్టీ, జీవీఎంసీలో విలీనం అయినా దీనికి మంచి రోజులు రాలేదు.

– దెక్కతి శ్రీనివాసరెడ్డి, భీమిలి రోడ్డు

వెనుకబడిన ప్రాంతంగా మారిపోయింది



చిల్లపేట, జీరుపేట గ్రామాలకు ప్రధాన మార్గంలో ఉన్న ఈ డ్రైనేజీలు అత్యంత దయనీయంగా ఉన్నాయి. దీంతో మా గ్రామాలు అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా కనిపిస్తున్నాయి. భీమిలిని ఆనుకుని ఉన్నా మాకు ఈ దుస్థితి ఏమిటో. అధికారులు, పాలకులు స్పందించాలి.

– దల్లి అప్పలరెడ్డి, జీరుపేట

రోడ్డు ఆధునికీకరణ పేరుతో జాప్యం



భీమిలి రోడ్డు విస్తరణ పేరుతో ఈ ప్రాంతంలో డ్రైనేజీలు అలాగే వదిలేశారు. రోడ్డు ఎప్పుడు విస్తరిస్తారో అప్పటి వరకు ఇలాగే ఉంచేయడం సరికాదు. కనీసం తాత్కాలికంగా పూడికలు తొలగించి, మురుగు ప్రవహించేలా పారిశుధ్య పనులైనా ఎప్పటికప్పుడు చేసేలా చూడాలి.

– బింగి హరికిరణ్‌రెడ్డి, చిల్లపేట

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మండలంలో భీమన్నదొరపాలెం, రామవరం, గంగసాని అగ్రహారం, కణమాం, మామిడిలోవ, నారాయణ గజపతిరాజుపురం తదితర ప్రాంతాల గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

చప్టాకు అడ్డుగా గ్రావెల్



చిల్లపేట చెరువు ముఖ ద్వారం వద్ద నీరు బయటకు పోకుండా వేసిన గ్రావెల్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేట చెరువు ముఖద్వారం వద్ద చప్టాపై ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు గ్రావెల్ అడ్డంగా వేశారు. దీంతో బయట డ్రైనేజీల ద్వారా వచ్చి చెరువులో చేరిన నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. అలాగే చెరువు పక్క తాత్కాలిక డ్రైనేజీలలో ప్రవహించే పాలిథిన్ సంచుల సంఖ్య బాగా పెరిగిపోయింది. ప్రకృతి సిద్ధంగా చెరువు నుంచి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో జరిగితేనే చెరువు చుట్టుపక్కల గ్రామాలకు సరిపోతుంది. ఇలా బలవంతంగా గ్రావెల్ వేసి చెరువు నీటిని బయటకు వెళ్లకుండా నిలువరిస్తే చెరువును ఆనుకుని ఉన్న పల్లపు గ్రామాలకు ముంపు సమస్యతో పాటు అక్కడి భూములు చౌడువారే ప్రమాదం ఉందని పెరికివీధి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు జోక్యం చేసుకుని చెరువు చుట్టూ ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా, చెరువు ఓవర్ ఫ్లో బయటకు వెళ్లేలా చూడాలని కోరుతున్నారు.

విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ వితరణ



స్పోర్ట్స్ కిట్లతో చిప్పాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 86 మంది విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ గురువారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసింది. ఇందులో కోటు, నోట్ పుస్తకాలు, స్పోర్ట్స్ షూ, నాప్‌కిన్లు, పెన్సిళ్లు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎం ఎంవీటీ రత్నం, ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్లు వెంపాడ రమాదేవి, చిల్ల మౌనిక, పీఈటీ రమేష్, వీవీ అనూరాధ, అహల్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరాముడి సోదర ప్రేమ అపారం



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: తమ్ముళ్లు లేకుండా దేవేంద్ర పదవి ఇచ్చినా అంగీకారం కాదని చెప్పడం శ్రీరాముడి సోదర ప్రేమకు నిదర్శనమని ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణంపై 13వ రోజు గురువారం ఆయన ప్రవచించారు. 14 ఏళ్లు పాదుకలు పాలన చేసిన ఘటన శ్రీరామాయణంలో మాత్రమే జరిగిందన్నారు. రామాయణంలో ఆచారకాండ కూడా గొప్పదని వివరించారు. దశరథ మహారాజు అనంతరం రాజ్యమును ఎవరు పాలించాలనే విషయంలో భరతుడు, శ్రీరాముడు మధ్య జరిగిన చర్చలో 'తండ్రి శరీరంతో ఉండగా ఏది శాసించారో, అలా పాటించడమే పుత్ర ధర్మం అని, దానిని మార్చడం ఎట్టి పరిస్థితుల్లో సరికాదని.. అలా మారిస్తే సమాజానికి తప్పుడు సంకేతం అందుతుందని, అందుచేత తాను రాజ్యమును స్వీకరించలేనని' శ్రీరాముడు చెప్పడం స్వప్రయోజనం కన్నా సమాజ ప్రయోజనం కోసం వ్యక్తి ఎంత విశాల హృదయంతో ఆలోచించాలనే విషయం తెలియజేస్తుందన్నారు.

పిల్లలకు కృత్యాల ద్వారా బోధించాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

- విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్
- ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతుల సందర్శన

మధురవాడ: పిల్లలకు నృత్యం, గీతాలు, గేయాలు, ఆటలు తదితర కృత్యాల ద్వారా వారికి సులువుగా అర్థం అయ్యే రీతిలో బోధన చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ సూచించారు. మధురవాడ ఐటీ సెజ్ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) 9వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. పిల్లలకు పునాది స్థాయిలోనే అద్భుతమైన బోధన జరిగితే వారు అనుకున్న రీతిలో ఎదుగుతారన్నారు. ఆ విధంగా బోధించాలని సూచించారు. శిక్షణకు విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 1, 2 తరగతుల ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎంవోలు జి.లక్ష్మి, దేముడుబాబు, పలువురు రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

మేడపై ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ వైరు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది



నగరపాలెంలో నాగరాజు ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్ వైరు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో పల్లా నాగరాజు అనే వ్యక్తి ఇంటిపై నుంచి ప్రమాదకరమైన 11 కేవీ విద్యుత్ లైన్ ఉండటంతో వారి కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాగరాజు కుటుంబ సభ్యులు విశాఖలో ఉన్న సమయంలో విద్యుత్ సిబ్బంది ఇంటిపై నుంచి లైన్ వేశారని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరమైన వైరు కారణంగా తామెవరూ మేడపైకి వెళ్లలేకపోతున్నామన్నారు. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు పంచాయతీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని నాగరాజు కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

కొమ్మాది: సాంకేతిక ప్రగతిపై, నూతన ఆవిష్కరణలపై అధ్యాపకులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని గీతం డీన్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్ కుమార్ అన్నారు. శాస్త్ర పరిశోధనలకు, పరిశ్రమల్లో సమాచార విశ్లేషణకు నూతన సాంకేతిక నమూనాలు అభివృద్ధి చేయడంలో ఉపకరించే మేట్ ల్యాబ్‌ను కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్‌లో ఏవిధంగా ఉపయోగించాలో వివరిస్తూ గీతంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేట్ ల్యాబ్‌లోని వివిధ సాధనాలు ఉపయోగించి, సమాచారాన్ని లోతుగా ఏవిధంగా విశ్లేషించవచ్చో వివరించారు.

కూటమి నాయకుల చెరలో గెడ్డ వాగు



గంభీరం గెడ్డవాగులో చేపడుతున్న నిర్మాణం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలో గెడ్డ వాగును కూటమి నాయకులు చెరపట్టి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడ సర్వే నంబర్ 173లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆనుకుని కొద్దిరోజులుగా నిర్మాణాలు జోరందుకున్నాయి. కూటమి నాయకులు 60 గజాల వంతున స్థలాలను లెక్కకట్టి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారు. గెడ్డలో ఆక్రమణలపై చూసి, చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని తొలగించాలని పంచాయతీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

'గాదె'కు పండిత పరిషత్ మద్దతు

తగరపువలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ గాదె శ్రీనివాసులు నాయుడుకు మద్దతు తెలిపింది. ఉత్తరాంధ్ర జిల్లాల తరఫున మద్దతు ప్రకటిస్తున్నట్టు పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.దయానంద్, టీఎస్‌వీ ప్రసాదరావు భీమిలి మండలం తాటితూరులో గురువారం తెలిపారు.

సెక్యూరిటీ గార్డు దుర్మరణం



మృతుడు చింతాడ రవి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం జాతీయరహదారిపై గురువారం ఉదయం ద్విచక్రవాహనం ఢీకొని చింతాడ రవి(53) అనే సెక్యూరిటీ గార్డు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలివి.. మండలంలోని గొట్టిపల్లికి చెందిన రవి గంభీరంలోని సమైఖ్య అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ రోజు ఉదయం 4 గంటలకు నిద్రలేచి క్యారియర్ పట్టుకుని, ఆటోలో గంభీరం చేరుకుని 5 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి ఆనందపురం వైపు వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో వాహనంపై ఇద్దరు ఉన్నారు. ఈ ప్రమాదంలో రవికి తల, కాళ్లు, చేతులపై బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తించే కోరాడ శ్రీను ప్రమాద సమాచారాన్ని మృతుని కుమార్తె భవానికి అందించడంతో, ఆమె ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ చింతల వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ బయోమెట్రిక్ మరెందుకో?

- 'సాక్షి' కథనంపై జీవీఎంసీ తప్పుడు రిజాయిండర్
- విచారణ చేస్తామన్న జెడ్సీ ఫణిరాం



సద్గురు సాయినాథ కాలనీ వద్ద లబ్ధిదారులతో వేలిముద్రలు వేయిస్తున్న సచివాలయ సిబ్బంది

మధురవాడ: లబ్ధిదారులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వకుండా ఒకే చోటకు కొందరిని పిలిచి ఇస్తున్నా.. వాస్తవాన్ని అంగీకరించేందుకు కూడా జీవీఎంసీ అధికారులు సిద్ధంగా లేరు. పింఛన్‌దారులను ఓ చోటకు పిలిచి ఇస్తున్న పద్ధతిపై ఈ నెల 2వ తేదీన 'సాక్షి'లో 'పింఛన్ కష్టాలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. జీవీఎంసీ 7వ వార్డులో 70 వార్డు సచివాలయ ఉద్యోగి 'ఈ నెల 1వ తేదీన పింఛన్ పంపిణీ సందర్భంగా శివశక్తినగర్ రోడ్డులో సద్గురు సాయినాథ కాలనీలో వద్ద ఓ షాపు మెట్ల మీద సర్వర్ పనిచేయని కారణంగా వేచి ఉన్నామని.. అక్కడ ఎవరికీ ఫించన్ ఇవ్వలేదని' రిజాయిండర్ ఇచ్చారు. ఫొటోలో పింఛన్‌దారులు ఎవరూ లేరంటూ పేర్కొన్నారు. అయితే సదరు ఫొటోలో కనిపించినట్లు పింఛన్లు ఇవ్వకుండా వేలి ముద్రలు ఎందుకు వేయించుకుంటున్నారు? అక్కడున్న వారు లబ్ధిదారులు కాకపోతే మరి ఎవరో సెలవివ్వగలరా..! సదరు వ్యవహారంలో జెడ్సీ ఫణిరాంను వివరణ కోరగా పూర్తి స్థాయి విచారణ చేస్తామని చెప్పారు.

వసతి గృహం నాణ్యత డొల్ల

- ప్రారంభానికి ముందే పగుళ్లు
- ప్రహరీ దాటి రోడ్డు మీదకు వస్తున్న వ్యర్థాలు



ప్రారంభానికి నోచుకోని వసతిగృహం



వసతిగృహం నుంచి బయటకు వస్తున్న టాయిలెట్ వ్యర్థాలు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.2 కోట్లతో ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం పేరుతో భవనాన్ని నిర్మించింది. కానీ ఆ భవనం అసంపూర్తి నిర్మాణం కారణంగా ఇప్పటి వరకు ప్రారంభించిన పాపాన పోలేదు. తరువాత ఇదే ఆవరణలో ప్రారంభమైన చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తరగతులను తాత్కాలికంగా ఈ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి మరమ్మతులు చేపడుతుండటంతో అక్కడి విద్యార్థినులకు కూడా ఈ నూతన భవనంలోకి తాత్కాలికంగా మార్చారు. దీంతో భవన నిర్మాణంలో నాణ్యత బండారం బయట పడింది. కళాశాల, వసతి గృహం విద్యార్థులు వినియోగిస్తున్న టాయిలెట్ల కారణంగా సెప్టిక్ ట్యాంకుకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో వ్యర్థాలు ప్రహరీ దాటి బయట మార్గంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ మార్గంలో మరో పాఠశాల ఉన్నందున రాకపోకలు సాగించే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దుర్గంధానికి తోడు జారిపడుతున్నారు.